



ESTD : 1999


# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## ఉమ్మడి వరంగల్ జిల్లా

ఆదివారం, ఏప్రిల్ 19 - 2026

మన కవులను..

# గౌరవించుకోవడం మన బాధ్యత...!

-బమ్మెర పోతనకు నివాళులర్పించిన

కలెక్టర్ శారద

- ప్రపంచ వారసత్వ దినోత్సవం

2లో




సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా..

# అమలు చేయాలి..




-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

-సంక్షేమ వారంపై సమీక్ష

2లో

భారం కాదు.. భరోసా..

## హెల్మెట్ ధరించండి..

## ప్రాణాలు కాపాడుకోండి..

- ఉచితంగా హెల్మెట్లను

పంపిణీ చేసిన పోలీసులు

3లో



# మన కవులను గౌరవించుకోవడం మన బాధ్యత

## బమ్మెర పోతనకు ఘన నివాళి అర్పించిన కలెక్టర్ సత్య శారద

### ప్రపంచ వారసత్వ దినోత్సవం





**వరంగల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 18(విజన్ ఆంధ్ర):** ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లాలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య శిఖరం, సహజ కవి బమ్మెర పోతనను స్మరించుకుంటూ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. వరంగల్ నగరంలోని పోతన ఆడిటోరియంలో నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, తొలుత బమ్మెర పోతన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన సంస్కృతికి మూలస్తంభాలైన కవులను గౌరవించుకోవడం మన బాధ్యత అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన వారసత్వ సంపదను భావి తరాలకు అందించడంలో ఇలాంటి సాహిత్య కార్యక్రమాలు కీలకమని అన్నారు . మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు చారిత్రక కట్టడాలే మన నిజమైన ఆస్తి. వీటిని కాపాడుకోవడంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకం అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మన గొప్ప వారసత్వంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం రోజున పోతన వంటి మహనీయుడిని స్మరించుకోవడం మనందరికీ గర్వకారణమని కలెక్టర్ తెలిపారు. ఈ వేడుకల్లో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు అలరించిన విద్యార్థుల పద్య పఠనంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోతన రచించిన భాగవత పద్యాలను విద్యార్థులు మధురంగా ఆలపించి సభికులను ముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, శ్రీధర్‌రావు కో కన్వీనర్ తో పాటు పలువురు విద్యా వేత్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాహిత్య అభిమానులు జిల్లా అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో పద్య పఠనంలో ప్రతిభ కనబరిచిన



విద్యార్థులను అభినందించారు.

# సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

## సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు






**వరంగల్, ఏప్రిల్ 18(విజన్ ఆంధ్ర) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థ వంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికా రులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శారద మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు,సంబంధిత శాఖల అధికారులకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలతో సంసిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి డిబిసిడిఓ పుష్పలత మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్ చీదురు శంకర్



**వరంగల్ ఏప్రిల్18(విజన్ ఆంధ్ర) :** పర్వతగిరి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతూ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా విషయం సర్పంచ్ దృష్టికి తెచ్చారు. నేపథ్యంలో స్థానిక సర్పంచ్ చీదురు శంకర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మండల పరిధి గ్రామాలతో పాటు పరిసర గ్రామాల రైతులు అధిక సంఖ్యలో మొక్కజొన్నను మార్కెట్ యార్డుకు తీసుకురావడంతో యార్డు పూర్తిగా నిండిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ రోజు దాదాపు 8 వేల బస్తాలు మార్కెట్‌కు చేరుకున్నప్పటికీ, సరిపడా కొనుగోలు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న మొక్కజొన్నకు కాంటాలు నిర్వహించాలంటే కనీసం 40 వేల బస్తాల సామర్థ్యం అవసరమని తెలుస్తోంది. ఈ సమస్యపై స్పందించిన సర్పంచ్ చీదురు శంకర్, పరిస్థితిని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకుని కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆయన కోరారు. రైతులు మాత్రం కొనుగోళ్లు వేగంగా జరపాలని, ఆలస్యం కారణంగా నష్టాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మార్కుఫెడ్ సిఈఓ సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భారం కాదు... భరోసా

**హెల్మెట్ ధరించండి... ప్రాణాలు కాపాడుకోండి**

**ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసిన పోలీసులు**





**సంగెం ఏప్రిల్ 18 విజన్ ఆంధ్ర :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రోడ్డు భద్రతపై అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా కుంటపల్లి, కాపుల కనపర్తి, లోహిత గ్రామాలలో సర్పంచుల ఆధ్వర్యంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్ తో కలిసి తహసిల్దార్ రాజకుమార్, ఎస్సై వంశీకృష్ణ, ఎంపీడీవో రవీందర్, వాహనదారులకు ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించి వినూత్నంగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వాహనదారులకు పువ్వులు ఇచ్చి హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించాలని సిఐ రాజగోపాల్ అన్నారు.. అనంతరం వాహనదారులకు ఉచితంగా సంగెం పోలీసులు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ దారించాలి అన్నారు. నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యం భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడం లేదు చిన్న పాటి నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు గాలిలో. ఎక్కువగా యువత హెల్మెట్ దంచకుండా బైకులపై వేగంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వారి కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారు.. రోడ్డు ప్రమాదంలో ప్రాణప్రాయం నుండి బయట పడేందుకు హెల్మెట్ ఏ విధంగా ఉపయోగపడుతుందొ వాహన దారులకు వివరించారు. ప్రతి ఏటా రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్లు ధరించకపోవడం వల్లే అధిక శాతం మృతి చెందుతున్నారని తెలిపారు. ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించి విలువైన తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పెంతల సువర్ణ, సదిరం చంద్రమౌళి, బొమ్మెర నాగేష్, పోలీసులు, వార్డు మెంబర్లు, ప్రజలు వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## "అరైవ్ అలైవ్" అవగాహన

## కార్యక్రమంలో బ్లాక్ స్పాట్స్ గురించి నివారణ చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ డాక్టర్ సత్య శారద..




**వరంగల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 18(విజన్ ఆంధ్ర):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమం ముగింపు సందర్భంగా గావిచర్ల క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని, వేగ నియంత్రణ పాటించాలని తెలిపారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, యువత రోడ్డు భద్రతపై బాధ్యతతో వ్యవహరించాలని, అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో అధికారి శోభన్ , సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**సంగెం ఏప్రిల్ 18 విజన్ ఆంధ్ర :** గవిచర్ల మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎస్ పి. ప్రసన్న లక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుండి మే 12 వరకు తరగతులు నిర్వహించబడును ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒకటి వరకు ఫెయిల్ అయిన సబ్జెక్టులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెరుగైన ఫలితాలు సాధించుటకు విద్యాశాఖ నిర్ణయించడం జరిగింది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను సకాలంలో కాలేజీకి పంపించాలి. ఫేస్ రికగ్నిషన్ హాజరు తీసుకోబడును విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

## నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

**సంగెం ఏప్రిల్ 18 విజన్ ఆంధ్ర :** మండలంలోని గవిచర్ల పియం శ్రీ మోడల్ స్కూల్ లో 2026-2027 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 67 మంది, 7నుండి పదో తరగతిలో కాళీ సీట్లకు 48 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. నేడు ఆదివారం మోడల్ స్కూల్ లో ఉదయం 10 నుండి 12 గంటల వరకు ఆరో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుండి 4 వరకు 7 నుండి పదో తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ పి. ప్రసన్న లక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేలా గళమెత్తిన వరంగల్ ఎంపీ కావ్య

### వరంగల్ ఎంపీ కడియం కావ్యకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఓయూ విద్యార్థుల ఘన స్వాగతం

**వరంగల్ ఏప్రిల్18(విజన్ ఆంధ్ర):** తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను లోక్‌సభలో తీవ్రంగా నిలదీసి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేలా గళమెత్తిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు ఢిల్లీ నుంచి విచ్చేసిన సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో ఓయూ రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పార్లమెంట్‌లో "కాకతీయ రుద్రమ"లా పోరాడిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి మద్దతుగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై పూలమాలలతో అభినందించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, మహిళా చైతన్యాన్ని ఎంపీ డా. కడియం కావ్య తన స్ఫూర్తిదాయక ఉపన్యాసాల ద్వారా ప్రతిబింబించారని కొనియాడారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానపరిచడాన్ని సహించబోమని, పార్లమెంట్‌లో తాను వ్యక్తపరిచింది తెలంగాణ ప్రజల గళమే" అని అన్నారు. "ప్రతి వర్గానికి న్యాయం జరిగే వరకు తన పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ హక్కులు, ఆత్మగౌరవం కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# మున్నూరుకాపుల జనాభాను తగ్గించడం, రాజకీయంగా, సామాజికంగా అణచివేసే కుట్ర:ఎంపీ రవిచంద్ర



**న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 18:**మున్నూరు కాపులను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అణచివేసేందుకు ప్రభుత్వ స్థాయిలోనే కుట్రలు ప్రారంభమయ్యాయని, వీటిని తక్షణమే తిప్పికొట్టకపోతే కుల సమాజ ఉనికికే ప్రమాదం అని అన్ని పార్టీల మున్నూరుకాపు నేతలు స్పష్టం చేశారు.

తమ హక్కులను కాపాడుకునేందుకు, తమ మీద జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు,పార్టీలు భావజాలాలకు అతీతంగా, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సమాజమంతా ఐక్యం కావలసిన అత్యవసర పరిస్థితి తలెత్తిందని...రాజకీయంగా, సామాజికంగా అణచివేయడానికి,ఆధిపత్య పాలక వర్గాలనుండి, మున్నూరుకాపుల మీద జరుగుతున్న ఉద్దేశపూర్వక దాడుల ను, వివక్షపూరిత ధోరణులను తీవ్రంగా తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని కుల పెద్దలు స్పష్టం చేశారు.

ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ పటేల్,కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పటేల్,బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పటేల్ , పీసీసీ మాజీ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు వీ. హనుమంత రావు పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ పటేల్ తదితర ప్రముఖులతో మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యులు సమావేశమయ్యారు.కాగా,గత ప్రభుత్వం మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం కోకాపేటలో 5, ఎకరాల భూమి కేటాయించిన విషయం తెలిసిందే.మున్నూరుకాపు ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ స్థలంలో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆర్థిక వనరులు తదితర సమన్వయలోపాల కారణంగా పనులు ఆలస్యమ వుతున్న నేపథ్యంలో భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల ఢిల్లీ పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు, కులం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి సవివరంగా చర్చించారు.రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో మున్నూరుకాపు ఫౌండేషన్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రౌతు కనకయ్య పటేల్, సభ్యులు మంగళారపు లక్ష్మణ్ పటేల్,పన్నాల విష్ణువర్ధన్ పటేల్,రమేష్ హజారి పటేల్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్, నాయకులు ఇసంపల్లి వెంకన్న పటేల్, కాశెట్టి కుమార్ పటేల్ ఆవుల రామారావు పటేల్,వెంగళ రమేష్,ప్రముఖ మ్యూజిషియన్ సామల వేణు,మహిళా నేతలు కొంతం దీపిక, ఆకుల శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేటర్లు సూపర్వైజర్ల శిక్షణ

**వరంగల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 18(విజన్ ఆంధ్ర):** జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు మొదటి బ్యాచ్‌కు 3 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మొదటి రోజు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం సందర్శించారు.ఈసందర్భనలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం 18.04.2026, 20.04.2026 మరియు 21.04.2026 తేదీలలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. శిక్షణలో జనగణన ప్రక్రియ, డేటా సేకరణ విధానాలు, ఫార్మ్‌ల వినియోగం, సమాచార ఖచ్చితత్వం వంటి అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించబడుతుందని తెలిపారు.జనగణనలో పాల్గొనే సిబ్బంది బాధ్యతతో వ్యవహరించి, ప్రతి ఇంటి వివరాలను నిష్పక్షపాతంగా మరియు సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు




సరైన అవగాహన కల్పిస్తూ వారి సహకారం పొందే విధంగా పని చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట తాసిల్దార్ విజయసాగర్ ఎంపీడీవో వెంకటరమణ సంబంధిత శాఖల అధికారులు, శిక్షణ పొందుతున్న ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండ

## ఉమ్మడి వరంగల్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు





**వరంగల్ ఏప్రిల్18(విజన్ ఆంధ్ర) :** హన్మకొండ డిసిసి భవన్ నందు తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టిపిసిసి ఉపాధ్యక్షురాలు శ్రీమతి హనుమండ్ల ఝాన్సీ రెడ్డి చైర్మన్, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ ఇనుగాల వెంకట్రామిరెడ్డి గారు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ ఆయుబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మహిళల సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యం, కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక పాత్రపై విస్తృతంగా మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ ఆవిర్భావం నుంచి నేటి వరకు మహిళల అభ్యున్నతికి, వారి రాజకీయ భాగస్వామ్యానికి, నాయకత్వ వికాసానికి కాంగ్రెస్ పార్టీ విశేష కృషి చేస్తూ వస్తోందని ఆయన స్పష్టం చేశారు. దేశ రాజకీయ చరిత్రలో మహిళలకు గౌరవప్రదమైన స్థానం కల్పించిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. మహిళలకు కేవలం మాటల్లో కాకుండా, అధికారంలో, పాలనలో, ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక స్థానాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ చరిత్ర సాక్ష్యంగా నిలిచిందన్నారు.

భారతదేశానికి తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని ఆయన గుర్తు చేశారు. దేశ అభివృద్ధి, భద్రత, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠను పెంచడంలో ఆమె పోషించిన పాత్ర చారిత్రాత్మకమని కొనియాడారు. అదే విధంగా దేశ అత్యున్నత రాజ్యాంగ పదవైన రాష్ట్రపతి స్థానంలో మహిళకు అవకాశం కల్పించి మహిళా గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని తెలిపారు...

మహిళల రాజకీయ హక్కుల సాధనలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుండిందని, మహిళా రిజర్వేషన్ బిల్లును తొలిసారిగా పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చిన పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీయేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మహిళలకు శాసనసభలు, పార్లమెంట్‌లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నో దశాబ్దాలుగా నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు.. మహిళలు సమాజ నిర్మాణంలో కీలక శక్తిగా నిలుస్తారని, వారి అభిప్రాయాలు, నాయకత్వం, నిర్ణయాలు దేశాభివృద్ధికి అత్యంత అవసరమని ఆయన అన్నారు. మహిళా కాంగ్రెస్ నాయకులు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, మహిళా సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు, జిల్లా మహిళా కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



